# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-01-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు.**
2. **పోలవరం ప్రాజెక్టును రానున్న రెండేళ్ళల్లో పూర్తిచేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.**
3. **ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.**
4. **రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శిగా ముకేశ్ కుమార్ మీనా ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.**
5. **విజయవాడ రైల్వే స్టేషన్ భారత ఆహార భదర్తా ప్రమాణాల సంస్థ అందించే ఈట్ రైట్ స్టేషన్ ధృవీకరణను పొందిందని రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ పేర్కొన్నారు.**

==========================

రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఈ రోజు ఒంగోలులో నిర్వహించిన వాక్ థాన్ ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలవీరాంజనేయస్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ నెల రోజుల పాటు నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు రహదారి భద్రత పై అవగాహన కల్పించడం జరగుతుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (28 సెకన్లు)

--------------------------

పోలవరం ప్రాజెక్టును రానున్న రెండేళ్ళల్లో పూర్తిచేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ సంవత్సరం చివరికల్లా డయాఫ్రం వాల్ పనులు పూర్తిచేస్తామని వివరించారు. గోదావరి మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు మళ్లించి, రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

--------------------------

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయవాడలో విద్యుత్ ఉద్యోగులు నిర్వహించిన కార్యక్రమంలో 2025డైరీ, క్యాలెండర్ ను మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ అమలుపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నామని చెప్పారు. రాష్ట్రంలో 30 గిగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్...28 సెకన్లు

-----------------------------

స్విజ్జర్లాండ్‌లోని దావోస్‌లో రాష్ట్ర బృందం పర్యటన కొనసాగుతోంది. హిటాచీ ఇండియా మానేజింగ్ డైరెక్టర్ భరత్ కౌశల్‌తో ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు సమావేశమైయ్యారు. సమర్థమైన విద్యుత్ ప్రసారం కోసం రాష్ట్రంలో అధునాతన సాంకేతికతను అమలు చేసేందుకు సహకరించాలని కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలను వేగవంతం చేయాలని భరత్ కౌశల్‌ను కోరామని ఆయన తెలిపారు.

-----------------------------

విజయనగరం జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఇన్చార్జి మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లాలో పలు ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో కలిసి మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ,...

వాయిస్ ..28 సెకన్లు

-----------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ-రాజకీయ జీఏడీ సేవల ముఖ్య కార్యదర్శిగా ముకేశ్ కుమార్ మీనా అమరావతిలోని రాష్ట్ర సచివాలయం ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసిన నేపధ్యంలో ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న మీనాను జిఏడి ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేసింది. ఈమేరకు ఈ రోజు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా కూడా ముకేశ్ కుమార్ మీనా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

-----------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ సందానీ, షాహిన్ దంపతులకు ఆహ్వానం అందింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద ఇంటిని నిర్మించుకున్న వారిని ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వారిలో జిల్లాలోని ఉదయగిరికి చెందిన షేక్ సందానీ, షాహిన్‌లకు ఆహ్వానం అందిందని అధికారులు తెలిపారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రదర్శనలో ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో రూపొందించిన వీరి ఉత్పత్తులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిలకించి ప్రశంసించారు.

-----------------------------

రాష్ట్రాన్ని మత్తుపదార్థాల రహితంగా ఆవిష్కరించేందుకు నవోదయం కార్యక్రమాన్ని ఈ నెల 29వ తేదీ నుండి ప్రారంభిస్తున్నట్లు ఆబ్కారీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలంలోని జెర్రిపోతులపాలెంలో మద్యం ఉత్పత్తి తయారీ కేంద్రాన్ని నిన్న ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి

మాట్లాడుతూ, రాష్ట్రంలో నూతన మద్యం విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. తద్వారా సారా, గంజాయి అమ్మకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

విజయవాడ రైల్వే స్టేషన్ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ– ఎఫ్ఎస్ఎస్ఏఐ అందించే ఈట్ రైట్ స్టేషన్ ధృవీకరణను పొందిందని డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్ రావు పాటిల్ తెలిపారు. విజయవాడలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రయాణీకులకు పరిశుభ్రమైన సురక్షితమైన ఆహార పద్ధతులను అమలు చేసినందుకు గానూ ఈ ఘనతను సాధించినట్లు చెప్పారు. విజయవాడ రైల్వే స్టేషన్ డివిజన్‌లోని రెండవ స్టేషన్‌గా, దక్షిణ మధ్య రైల్వేలో ఐదవ స్టేషన్‌గా నిలిచిందని చెప్పారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయాన్ని విజయనగరం జిల్లాలో ప్రయోగాత్మక ప్రాతిపదికన చేపట్టనున్నామని 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మన్ లంకాదినకర్, తెలిపారు. విజయనగరంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో సేంద్రియ సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, అవసరమైన పంటలు వంటి అంశాలను అధ్యయనం చేయడానికి నిపుణుల బృందాన్ని పంపనున్నట్లు వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులకు బ్రాండింగ్‌ను కల్పిస్తామని ఆయన తెలియచేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 20 సెకన్లు....

---------------------------

రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రజక సంక్షేమ అభివృద్ధి సంస్థ చైర్మన్ సి.సావిత్రి తెలిపారు. అనంతపురంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి రజకుల సమస్యలు తెలుసుకున్నామని అన్నారు. త్వరలో జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల విస్తరణ, వాటికి అనుబంధంగా ఉప రహదారులు –బైపాస్‌ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ వేగంగా పూర్తిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన అమరావతిలో జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో నిన్న దృశ్య మాధ్యమ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, జాతీయ రహదారుల నిర్మాణాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకొని, వాటికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. అలాగే భూసేకరణ రైతులకు సకాలంలో నష్టపరిహారం అందేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

======================